


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే
## *చివరి విడత: మలి సందడి (34)*

### *మరో దేవుడు పిలిచాడు*

మతం ఒక మహత్తర సాంఘిక శక్తి. నిజానికది మనుషుల్ని సంఘటితం చెయ్యాలి. కానీ మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడానికే ఎక్కువగా సహకరిస్తూ, మానవజాతిని మారణహోమానికి ప్రోత్సహించడం – ఇప్పటికీ ఎన్నోచోట్ల జరుగుతున్న కథ. అందుకే నాకు మతమంటే కొంత చిరాకు ఉంది. దాని గురించి వీలైనంత తక్కువ ఆలోచిస్తాను.

అలాంటి నేను ఒక మతాన్ని గుడ్డిగా నమ్మే ప్రవక్తలతో సమావేశమై, మతం ప్రాముఖ్యం గురించి కొన్ని గంటల సేపు చర్చిస్తానని కలలో కూడా అనుకోలేదు.

మతమార్పిడి కోసం సామ దాన భేద దండోపాయాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందనీ ఊహించలేదు.

శతాబ్దాలుగా మన దేశంలో మతమార్పిడులు సాధారణంగా ఉంటూ వచ్చాయి. బలహీనులు, అణగద్రొక్కబడినవారు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడం అందుకు కారణం.

కానీ ఆర్థికంగా వైజ్ఞానికంగా అగ్రస్థానంలో ఉన్న అతి కొద్ది దేశాల్లో ఒకటైన దేశం జర్మనీ. అక్కడివారితో కలిసి సైంటిఫిక్ రీసెర్చి చెయ్యడానికి అర్హత సంపాదించినవాణ్ణి నేను. అక్కడి మతాచార్యులు మతమార్పిడికి నన్ను ప్రలోభపెట్టే ప్రయత్నం చెయ్యడం చాలా అరుదైన అనుభవం. అందుకే అది నా మనసుపై చెరగని ముద్ర వేసింది. ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఇప్పుడే జరిగినంత స్పష్టంగా మా సంభాషణ వివరాలు గుర్తుండిపోయాయి.

వాటినిక్కడ ఇంచుమించు యథాతథంగా పంచుకుంటున్నాను.

వచ్చిన ప్రీస్టుల్లో పెద్దాయన – నా ఆర్థిక పరిస్థితి ప్రస్తావన తెచ్చాడంటే, తను నిజంగానే నన్ను తన మతంవైపు ఆకర్షించడానికే వచ్చి సామం కంటే ముందు దానోపాయంతో మొదలెట్టాడని అనుమానం కలిగింది.

ఒక్క క్షణం తటపటాయించి నెమ్మదిగా అన్నానుః "మనిషికి కనీస అవసరాలు కూడు, గుడ్డ, నీడ. అంతకంటే అదనంగా ఏమున్నా ఆ మనిషి ధనికుడి కిందే లెక్క. నేను ఇక్కడ ధనికుడిలాగే ఫీల్ అవుతున్నాను"

పెద్దాయన నవ్వి, "మీరు చెప్పేది వేదాంతం. వాస్తవంలోకి వస్తే, కారు ఇక్కడ కనీసావసరం. మీకు ఆర్థికంగా ఏమైనా ఇబ్బందులుంటే మాకు చెప్పండి. కనీస అవసరాల గురించి మీ ఆలోచనలు వాస్తవానికి దగ్గరగా ఉండేలా చేయగలం" అని కుతూహలంగా నా కళ్లలోకి చూశాడు.

నాకు అర్థమైపోయింది.

వచ్చినవాళ్లు నన్ను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఎందుకో ఊహించలేనంత అమాయకుణ్ణి కాను నేను.

అయితే నా అంతట నేను బయటపడదల్చుకోలేదు. "చాలా థ్యాంక్స్. అవసరమనిపించినప్పుడు మీ ఆఫర్ తప్పక గుర్తుంచుకుంటాను" అన్నాను.

పెద్దాయన మొహంలో కొంచెం సంతోషం, కొంచెం అసంతృప్తి. అదోలా నవ్వి, "ఆ అవసరం ఇప్పుడే అనిపించినా చెప్పొచ్చు" అన్నాడు.

జిడ్డులా తగుల్కున్నట్లు తోచింది. మనసులో కొంచెం చిరాకనిపించింది. బయటపడకుండా తమాయించుకుని, "స్వతహాగా నాకు సంతృప్తి ఎక్కువ. ఇక్కడికొచ్చాక అది రెట్టింపయింది. అందుచేత ఇప్పట్లో నాకు అవసరం అనిపిస్తుంది అనుకోను" అన్నాను.

ఆయన మొహంలో దెబ్బతిన్న ఫీలింగ్ కనిపించింది. ఒక్క క్షణం మాట్లాడలేదు.

ఏమంటాడా అని నాలో కుతూహలం. ఆయన్నే చూస్తున్నాను.

"మీరు అల్పసంతోషి అంటే ఒప్పుకుంటాను. కానీ ఇక్కడికొచ్చాక మీ సంతృప్తి పెరిగిందంటే మాత్రం నమ్మలేను. ఎందుకంటే ఇక్కడ ఎక్కువమంది క్రైస్తవులు. వాళ్లంతా మీకంటే ఎక్కువ సంతృప్తితో ఉన్నారు. వాళ్లలో ఒకరుగా కలిసినప్పుడే మీకు సంతృప్తి పెరుగుతుంది. మీ సంతృప్తి పెరిగిందంటే, మీరు వాళ్లలో ఒకడిగా కలిసిపోవడానికి మానసికంగా సిద్ధపడ్డారని అనుకోవాలి. అవునా?" అన్నాడాయన.

ఇది సామం కాదు. చతురోపాయాల్లో ఏదీ కాదు. ఒక తరహా వశీకరణ అనొచ్చేమో! దీన్ని చతురోపాయాలకు కలపొచ్చు.

క్రమంగా ఆయన ఉద్దేశ్యం బట్టబయలౌతోంది. ఐనా ఆయన గోప్యంగా ఉండే ప్రయత్నం కూడా చేస్తున్నాడనిపించదు.

నేను మాత్రం తెలియనట్లే నటించాలి అనుకున్నాను. "ఇక్కడివాళ్లు నాకంటే ఎక్కువ సంతృప్తిగా ఉన్నారని నాకెప్పుడూ అనిపించలేదు. కానీ ఇక్కడివాళ్లలో ఒకడిగా కలిసిపోవడం మాత్రం ఇక్కడికొచ్చే ముందునుంచీ నాకిష్టమే" అన్నాను.

అది గ్రీన్ సిగ్నలుగా పొరబడ్డారో ఏమో, ఉన్నట్లుండి ఇప్పుడు పెద్దాయనతోపాటు చిన్నాయన మొహం కూడా వెలిగింది.

"ఇక్కడివాళ్లతో కలిసిపోవాలంటే – సులభమైన మార్గం క్రైస్తవమతం స్వీకరించడమే. ఆ విషయంలో మేము మీకు సాయపడగలం" అన్నాడు చిన్నాయన.

చల్లకొచ్చారని బయటపడడంతో, ఇక ముంతను దాచడం అనవసరం అనుకున్నారని గ్రహించాను.

“మనిషి మనిషితో కలిసిపోవడానికి మతం ఎందుకు? మంచి మనసుంటే చాలు కదా!” అన్నాను.

వెంటనే పెద్దాయన అందుకుని, “మతం ఎందుకంటే, మనసుని మంచిగా ఉంచడానికి” అన్నాడు.

“అయితే ఇప్పటికే నాకో మతం ఉంది. దాన్నొదిలి ఇంకోదానికి మారడం ఎందుకు?”

“ఎందుకంటే, ప్రపంచంలో సగానికి పైగా జనాలకి క్రైస్తవమతం ఇష్టమైంది. అంతమంది ఇష్టపడ్డారంటే, అన్ని మతాల్లోకీ అదే మంచిదని అర్థం. పైగా ప్రపంచంలో ఇప్పుడు ప్రజాస్వామ్యం నడుస్తోంది. ఎక్కువమంది దేన్నిష్టపడితే, అదే అందరూ అనుసరించాలి”

మా సంభాషణ తర్కంలోకి మళ్లింది. తర్కం నా స్ట్రాంగ్ పాయింటు.

చిన్నప్పుడు మా బామ్మగారు నన్ను అనవసరంగా తప్పు పడితే, నేను తర్కానికి దిగేవాణ్ణి. ‘నీతో మాట్లాడాలంటే లాయర్ని పెట్టుకోవాలి” అని కాస్త ముచ్చటపడి తగ్గేవారామె. హైస్కూల్లో, కాలేజిలో, యూనివర్సిటీలో – మిత్రులతో వాదన వచ్చినప్పుడు – ‘నో ఆర్యుమెంట్స్! మేం చెప్పేది చెప్పాం. అంతే!” అని నాకు వాదించే అవకాశం ఇచ్చేవారు కాదు. వాదిస్తే ఓడిపోతామని భయం వాళ్లకి.

ప్రియూనివర్సిటీలో నా గ్రూపు ఎంపీఎల్. అంటే మాథ్స్, ఫిజికల్ సైన్సెస్, లాజిక్. మా క్లాస్ మేట్సు లాజిక్ కష్టమనుకునేవారు. నాకు మాత్రం ఆ సబ్జక్టులోనూ ఫస్టుక్లాసొచ్చింది.

అలాగని నేను తర్కశాస్త్ర నిపుణుణ్ణనుకోను.

ఎవరైనా వాదనకు దిగేటప్పుడు, తమ పాయింటు నెగ్గాలని పట్టుదలగా ఉంటారు. నేను విషయం పట్ల అవగాహన పెంచుకుందుకూ,  నిజాన్ని తెలుసుకుందుకూ తర్కానికి పాల్పడతాను. అందువల్ల నా వాదనకు విలువ పెరిగేది. తమ పాయింటు నెగ్గాలన్న పట్టుదల ఉన్నవారి వాదన తాత్కాలికంగా నెగ్గినా, దానిలో పస ఉండదు. దానికి విలువుండదు.

ఇప్పుడు పెద్దాయన క్రైస్తవమతం విశిష్టతను నిరూపించడానికి చెప్పిన పాయింటులో బొత్తిగా పస లేదని గుర్తించాను. నాకు వాళ్లు – జ్ఞానసముపార్జన చేసిన మతాచార్యుల్లా కాక, మా ఇంట్లో బామ్మగారిలా, బయట మిత్రుల్లా సాధారణంగా కనిపించారు.

దాంతో నాలో జంకు, బెరుకు పోయి ధైర్యం వచ్చేసింది.

దొరికారు – అనుకుని, “మతం విషయంలో ప్రజాస్వామ్యం పాటించాలని అనుకుంటే, క్రైస్తవమతాన్ని పక్కన పెట్టక తప్పదు. ఎందుకంటే ప్రపంచ జనాభాలో మూడో వంతు చైనాలో ఉంది. ఐదో వంతు ఇండియాలో ఉంది. ఇండియాలో ఎక్కువమంది హిందువులు. చైనాలో ఎక్కువమంది బౌద్ధులు. బౌద్ధమతం కూడా హిందూమతం నుండే పుట్టింది. కాబట్టి ప్రపంచంలో ఎక్కువమంది ఇష్టపడేది హిందూమతమే ఔతుంది” అన్నాను.

వాళ్ళ వాదనను తిప్పికొట్టడానికి లోకజ్ఞానాన్ని వాడి ఏవో లెక్కలు చెప్పాను కానీ, ప్రపంచ జనాభాలో క్రైస్తవులే ఎక్కువ అని నాకు తెలియకపోలేదు. వాళ్లా విషయమై చిఠా తెరిచి లెక్కలు చెప్పి సవాలు చేస్తే కనుక, దానికీ నావద్ద సమాధానం సిద్ధంగానే ఉంది.

హిందువులు, బౌద్ధులకు ముస్లింలను కూడా కలిపితే — ఈ మూడు మతస్థుల సంఖ్య ప్రపంచ జనాభాలో సగంకంటే ఎక్కువే ఉంటుంది. కాబట్టి ప్రపంచంలో సగానికి పైగా క్రైస్తవులు కారని నేనూ సవాలు చేయవచ్చు.

అయితే వాళ్లకు ఇలాంటి లెక్కలపై పట్టున్నట్లు లేదు. ఏదో ఓ రాయేసి చూద్దామనుకున్నట్లున్నారు. నేను చెప్పిన జనాభా లెక్కలకు కొంచెం కంగు తిన్నట్లే కనిపించారు.

అదీకాక, తమ పాయింటుని నొక్కించడానికి లెక్కలమీద ఆధారపడ్డం వాళ్లకి ఇష్టమున్నట్లు లేదు.

పెద్దాయన గొంతు సవరించుకుని, "మీరు చెప్పిన లెక్కల గురించి వాదన పొడిగించాలని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే క్రైస్తవమతాన్ని అనుసరించే సంపన్నదేశాలే ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి. ఇతర మతాలకు ప్రాధాన్యమున్న దేశాలు సంపన్నమైనా వాటికి ప్రపంచాన్ని శాసించేటంత తెలివి లేదు. అందుకు కారణం మనిషికి సంతృప్తితోపాటు సంపదనీ, తెలివినీ కూడా ఇవ్వగలది క్రైస్తవమతం మాత్రమే. ఇది మీరు కూడా కాదనలేని నిజం" అన్నాడు.

నేను కూడా కాదనలేననడం, ముందరి కాళ్లకు బంధం వేసే ఓ పద్ధతి. నా చిన్నప్పుడు మా బంధువొకామె తనేం చెప్పినా, 'నువ్వు చెప్పినట్లు' అని ముందరికాళ్లకు బంధమేసేది. ఇంకా ఇంటా బయటా ఆఫీసులోనూ ఆ బంధాన్ని వాడడం నాకు స్వానుభవమే. బహుశా దీన్ని కూడా చతురోపాయాలకు కలపాలి.

ఏదేమైనా ఈ ప్రపంచంలో తెలివి, సంపద ఒక్క క్రైస్తవమతం వల్లనే లభిస్తాయనడం మాత్రం సిల్లీగా అనిపించింది. ఆ మతాన్ని అనుసరించే ఒక ప్రీస్టు ఆ మాటనడం — ఆ మతస్థుల తెలివిని అనుమానాస్పదం చేస్తుంది.

అదే చెప్పాలనుకున్నాను కానీ, నాకే కటువుగా అనిపించింది. ఏంచెప్పినా మర్యాద కూడా పాటించాలిగా – అందుకని ఓ క్షణం ఆలోచించి, "నేను విన్న ప్రకారం కొందరు మేధావుల అభిప్రాయంలో – మతం తెలివిని చంపేస్తుంది. అందుకే తెలివైనవాళ్ళు మతానికి దూరంగా ఉండాలనుకుంటారు" అన్నాను.

మతం నీ తెలివిని చంపేసి, నీచేత అలా మాట్లాడించింది సుమా అన్న విసురు అందులో లేకపోలేదు. కానీ ఆ విసురుని పసి కట్టే అవకాశమివ్వలేనంత మర్యాదని నాగొంతులో పలికించాను, మొహంలో ప్రదర్శించాను.

దీనికి పెద్దాయన వెంటనే స్పందించాడు: "ఆ మేధావుల్ని మేధావులనడానికి నాకు మనస్కరించడం లేదు. వాళ్లని మేధావులని ఒప్పుకోవాలంటే – హిందూమతాన్ని స్వీకరించిన మీరు తెలివైనవాళ్ళు కారని భావించాల్సి వస్తుంది?" అన్నాడు.

నన్ను భలే దెబ్బ కొట్టాననేమో ఆయన మొహంలో – చిరు గర్వం.

ఐతే నేను సిద్ధంగానే ఉన్నాను. అందుకే తడబడకుండా, “మా నాన్నగారు హిందువు. ఆయన సంతానం కాబట్టి నేను హిందువు అయ్యాను. అంతే తప్ప నేను ఏ మతాన్నీ స్వీకరించలేదు” అన్నాను.

ఇది వాళ్లకు తెలిసినట్లు లేదు. “అంటే మీకు స్వీకరించకుండానే పుట్టుకతోనే మతం వచ్చేస్తుందా? అలా ఎలా?” అన్నాడు చిన్నాయన.

ఏంచెప్పను? పుట్టుకతో మతమే ఏమిటి – కులం కూడా వస్తుంది మనకి! కానీ అది చెప్పుకుందుకు గర్వకారణం కాదు.

మన దేశంలో శ్రమవిభజనకోసం ఓ గొప్ప సంప్రదాయంగా ఆవిర్భవించింది కులవ్యవస్థ. అదిప్పుడు శ్రమను పక్కన పెట్టి, పుట్టుకతో ముడి వేసుకుని అర్థవిహీనంగా కొనసాగుతూ ఎన్నో అనర్థాలకు మూలకారణమైంది.

ప్రస్తుతం – కులం హిందూమతానికి పెద్ద మచ్చ అనుకునేవాళ్ళలో నేనూ ఉన్నాను.

అందుకే టాపిక్ కులంవైపు మళ్లకుండా జాగ్రత్త పడాలని అనుకుని, “ఔను. పుట్టగానే మనిషికి తండ్రి, తల్లి, ఇతర బంధువులు ఉన్నట్లే, మతమూనూ. దాన్ని స్వీకరించడానికి తతంగమేం ఉండదు” అన్నాను.

అనగానే అనిపించింది. ఇదేదో కొత్త సిద్ధాంతంలా బాగుందే అని,

చిన్నాయన మొహం అదోలా పెట్టాడు, “తలిదండ్రులు, బంధువులు వేరు. మతం వేరు. మతానికి సంబంధించిన విషయాలు, పద్ధతులు తెలుసుకుందుకు మతగురువులు ఉండాలి. మతం స్వీకరించనివారికి మతగురువులు ఎలా వస్తారు?” అన్నాడు.

“ఇక్కడ మీకో విషయం స్పష్టం చెయ్యాలి. హిందూమతం అని మీరంటారు కానీ, మేము దాన్ని హిందూత్వం అంటాం. అది మతం కాదు. ఒక జీవనశైలి. హిందూత్వం పాటించే మాలాంటి సాధారణ పౌరులకు మతగురువులంటూ వేరే ఉండరు. సంప్రదాయం విషయంలో పెద్దల్ని అనుసరిస్తాం. చాలావరకూ ఆచారాలు పెద్దల్ని చూసి నేర్చుకుంటాం. అయితే నేర్చుకోవాలనీ, అనుసరించాలనీ మాకేం నియమాలు లేవు. ఇష్టమైతే అనుసరిస్తాం, ఆచరిస్తాం. లేకపోతే లేదు. ఇష్టమైతే గుడికి వెడతాం. వెళ్లలేదేమని ఎవరూ అడగరు. ఇష్టమైతే ప్రార్థనలు చేస్తాం. చేయలేదేమని ఎవరూ తప్పు పట్టరు. నిజం చెప్పాలంటే మాదొక మతమనీ, నేను హిందువుననీ – ఎప్పుడైనా దరఖాస్తులు పెట్టాల్సొచ్చినప్పుడు తప్ప, మనసుకి స్ఫురించనే స్ఫురించదు” అన్నాను.

నేను చెప్పింది నా విషయంలో పూర్తిగా నిజమని చెప్పలేను. కానీ హిందూమతానికి సంబంధించి అది నిజమే కదా!

వీళ్లతో నేనన్న మాటలే, ఇండియాలో మా బంధువుల దగ్గర అంటే, వాళ్లు అప్పటికి నన్ను నాస్తికుడంటారు. మళ్లీ గుడికెళ్లడానికీ, వ్రతాల్లో పాల్గొనడానికీ నాకేమీ అభ్యంతరం లేదు కాబట్టి ఆ సమయాల్లో ఆ ఊసెత్తరు.

ఇలాంటి మతం ఒకటి ఉంటుందని ఊహించలేదేమో, నేనన్నది వినగానే ప్రీస్టులు ఇద్దరి మొహాల్లోనూ ఆశ్చర్యం కొంతా, నేను నాస్తికుణ్ణి కాదుకదా అన్న అనుమానం కొంతా కనిపించాయి.

ఇద్దరికీ తేరుకుందుకు కొంత సమయం పట్టింది. తర్వాత పెద్దాయన అన్నాడుః "మీరు పుట్టుకతో హిందువులు అయ్యారు కానీ ఆ మతాన్ని స్వీకరించలేదు. ఐనా హిందువు అనుకుందాం అనుకుంటే – ఆ మతంలో ఆచారాల్ని, నియమాల్ని, సంప్రదాయాల్ని పట్టించుకోలేదు. అసలు హిందువుని అన్న భావమే మీలో లేదు. అదీకాక హిందూత్వాన్ని మీరు మతంగా కూడా భావించడం లేదు. అంటే మీరు క్రైస్తవమతాన్ని స్వీకరిస్తే, అది మతమార్పిడికింద రాదు. ఔనా?" అన్నాడు.

తెల్లబోయాను.

నేను చెప్పిందాన్ని ఆయన తనకి సానుకూలంగా మార్చుకున్నాడు. తెలివైనవాడే!

నేను మాత్రం తక్కువ తిన్నానా, "ఇండియాలోనే ఉంటూ, అక్కడి మతాన్ని పట్టించుకోనివాణ్ణి. ఇక్కడికొచ్చి ఇంకో మతాన్ని స్వీకరించడం ఎందుకు?" అన్నాను.

"మీరు ఆస్తికులా, నాస్తికులా – ముందది చెప్పండి. ఎందుకంటే దేవుణ్ణి నమ్మేవారికి మతం ఉండి తీరాలి" నొక్కించాడు పెద్దాయన.

"నేను దేవుణ్ణి నమ్ముతాను. అందుకు మతం ఉండి తీరాలంటే, పుట్టుకతో వచ్చిన మతం ఉందిగా, అది చాలు నాకు"

పెద్దాయన తల అడ్డంగా ఆడించి, "చాలదు" అన్నాడు దృఢంగా.

అందుకాయన చెప్పిన కారణం చాలా విడ్డూరంగా ఉంది.

మనిషి చనిపోయేక దేవుడి దగ్గరకు వెడతాట్ట. దేవుడు ఆ మనిషిని, నువ్వు క్రైస్తవుడివా, కాదా అనడుగుతాట్ట. ఔనన్నవాణ్ణి స్వర్గానికి, కాదన్నవాణ్ణి నరకానికి పంపుతాట్ట.

"చనిపోయేక స్వర్గానికి వెళ్లాలనే అంతా అనుకుంటారు. అందుకు క్రైస్తవులే అర్హులు. ఈ విషయం తెలియనివారే అన్యమతాల్లో ఉంటున్నారు. అర్థమైంది కదా!" అన్నాడు పెద్దాయన.

ఆశ్చర్యపోయాను.

మతమంటే నమ్మకమని తెలుసు. దేవుడికి సంబంధించిన నమ్మకం గుడ్డిగా ఉండొచ్చుననీ తెలుసు. కానీ అది సామాన్యులకు!

ఒక గొప్ప మతానికి సంబంధించిన ప్రీస్టు – తన మతం ఆవశ్యకతను నొక్కించడానికి మరీ ఇంత చచ్చు పాయింటు ఎన్నుకుంటాడా?

నిజం చెప్పాలంటే అది పాయింటు కూడా కాదు. ఒక విధంగా బెదిరింపు.

ఈయన నాగురించి ఏమనుకుంటున్నాడు? ఇలా బెదిరించే ఆ మతం మాత్రం ఏం మతం?

అలా అనుకోగానే నాకు మన సత్యనారాయణవ్రతం స్ఫురించింది. ఆ వ్రతకథలో – వ్రతం వల్ల కలిగే ప్రయోజనాలకంటే, చెయ్యకపోవడం వల్ల జరిగే కష్టనష్టాల గురించిన బెదిరింపులే ఎక్కువ. అంటే మతాల్లో ఈ బెదిరింపులు మామూలే.

నేను మతాన్ని నిరసించాలని కాక, ఆయన్ని ఒక వ్యక్తిగా గుర్తించి ఆలోచించాలి. అలా ఆలోచిస్తే – ఆయన నా గురించి ఏమనుకున్నా – వ్యక్తిగా ప్రదర్శించే జ్ఞానం, వివేకం – స్థాయిలో నాకంటే తక్కువే అనిపించింది.

నాలో ఆ భావం కలగ్గానే, నాకాయనపై చులకనభావం పోయి, జాలి కలిగింది.

మనం ఎవరిమీద జాలి పడతామో, వాళ్లతో ఎక్కువ స్వేచ్ఛగా వ్యవహరించ గలుగుతాం.

నాలో ఉత్సాహం పెరిగింది. గొంతు సవరించి, "నేను సైంటిస్టుని. అనుభవిస్తున్న జీవితం నాకు నిజం. చనిపోయాక ఏమౌతానో నాకు తెలియదు. ఆ విషయమై ఆలోచించను కూడా. ఉన్నంతకాలం నలుగురికి మంచి చేస్తూ, తెలిసి ఇతరులకు హాని తలపెట్టకూడదన్నది నా ఆశయం. అలా బ్రతికే అవకాశం, మనోబలం నాకివ్వమని దేవుణ్ణి ప్రార్థిస్తాను. దేవుడంటే కోరిన వరాలు ఇస్తాడన్న ఆశ, తప్పు చేస్తే శిక్షిస్తాడన్న భయం నాకు లేవు. నేనేం సాధించినా, అది నా గొప్పతనం అన్న అహంకారం నాలో తలెత్తకుండా ఆపడానికి మాత్రమే దేవుణ్ణి నమ్ముతాను. అదీ నా ఆస్తికత్వం. ఇప్పుడు చెప్పండి. మతం నాకు అవసరమంటారా?" అన్నాను.

ఆయన వెంటనే మాట్లాడలేదు.

అంతలో శ్రీమతి, పిల్లలు లోపలకు వచ్చారు.

మావాళ్లు రావడం ప్రీస్టులకు మంచిదే – ఎందుకంటే, నేనన్నదానికి జవాబు ఆలోచించుకుందుకు కొంత సమయం దొరుకుతుంది.

శ్రీమతి మా ముగ్గురికీ వేడి వేడి చల్ల పుణుకులు ప్లేట్లలో పెట్టి ఇచ్చింది. వాళ్లు అందుకుని, కాస్త ఇబ్బందిగా నా వంక చూశారు.

"భయపడకండి. రుచిలో ఇవి మీ పిజ్జాకు దగ్గరగా ఉంటాయి" అని ధైర్యం చెప్పాను.

అంతలో శ్రీమతి అక్కడ బల్లమీద మూడు గ్లాసులు పెట్టి వాటిలో ఫెంటా పోసింది.

"మీరు మంచినీళ్లు తాగరుగా, వాటికి బదులు ఇది" అన్నాను నవ్వుతూ.

కానీ జర్మన్లు మంచినీళ్లకు బదులు తాగేది బీర్ అని నాకు తెలుసు. మరి మా ఇంట్లో బీరు ఉండదు. బీరుని కూడా ఆల్కహాలుగా పరిగణిస్తాం కాబట్టి, ఇంటికొచ్చిన అతిథులకు బీరు కూడా ఇవ్వకూడదని నియమం పెట్టుకున్నాం.

అయితే కాఫీ, టీలని అలవాటుగా భావిస్తాం కాబట్టి, అతిధులకు మా ఇంట్లో అవి లభిస్తాయి.

ఈలోగా పిల్లలు మంచం మీద చేరి, వళ్లో ప్లేటు పెట్టుకుని టిఫిన్ తింటున్నారు.

శ్రీమతి వాళ్ళ పక్కనే కూర్చుంది. కానీ తన దృష్టంతా మా మీదే ఉంది.

జంకుతూనే ప్రీస్టులిద్దరూ చెరో పుణుకూ నోట్లో వేసుకున్నారు.

కిర్ష్నరుతో అనుభవం అయిందిగా, నేను కూడా జంకుతూనే వాళ్ల మొహాల్లోకి  చూసాను.

పర్వాలేదు. వాళ్ళు ఇంకొకటి నోట్లో వేసుకున్నారు.

"శాకాహారుల ఫలహారం ఇది. ఎలా ఉంది?" అన్నాను.

"చాలా బాగుంది" అన్నారు ఇద్దరూ ఏకకంఠంతో.

నాకు అర్థమైంది. వాళ్లకి అవి మరీ ఎక్కువ నచ్చినట్లు లేదు. అయితే మర్యాదకు తినగలరు.

కొంచెం కొంచెం ఫెంటా తాగుతూ, వాళ్లు ప్లేట్లు కాళీ చేశారు.

నాకు మహదానందం అయింది. మనం పెట్టింది అతిథులు తింటే అదో తృప్తి కదా!

"వేడివేడిగా టీ తాగుతారా?" అనడిగాను.

వాళ్లు వద్దన్నారు.

మా ఆతిథ్యం బాగుందనడానికి నిదర్శనంగా వాళ్ళ మొహాలు మరింత ప్రసన్నం అయ్యాయి.

ఆతిథ్యం ఇచ్చిన తీరును బట్టి, మేము వాళ్లకు సుముఖంగా ఉన్నామన్న భ్రమ కూడా కలిగిందేమో పెద్దాయన కొంచెం ఉత్సాహంగానే– ఏసుక్రీస్తు గొప్పతనం గురించి చెప్పడం మొదలు పెట్టాడు.

చాలావరకూ తెలిసినవే.

ఏసుక్రీస్తు దేవుని కుమారుడు. ఆయన మనుషులకు సాధ్యం కాని ఎన్నో మహిమలు చేశాడు. ఎందరికో రోగాలు తగ్గించాడు. మనుషుల్ని పాపభారం నుంచి విముక్తుల్ని చేయడానికి తను శిలువను మోసాడు.... వగైరా వగైరా...

"ఇవన్నీ మా చిన్నప్పుడు పాఠాల్లో చదువుకున్నాం" అన్నాను.

ఆయన కళ్లు మెరిశాయి.

"చూశారా, ప్రపంచమంతా స్కూళ్లలో ఏసు గురించిన పాఠాలు ఉంటాయి. ఎందుకంటే ఆయనను స్మరించడమే ఎంతో పుణ్యం. ఆ పుణ్యంతోనే మీరు ఇక్కడికి వచ్చారు. ఇక మా మతంలో చేరితే, మీ భవిష్యత్తు ఎలా మారిపోతుందో మీ ఊహకందదు" అన్నాడు.

"ఏసుక్రీస్తు అవతార పురుషుడని మా దేశంలోనూ చాలామంది నమ్ముతారు. వాళ్లలో హిందువులూ ఉన్నారు. మా దేశ స్వతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించిన గాంధీమహాత్ముణ్ణి కూడా కొందరు అవతారపురుషుడు అంటారు. ఆయన కూడా ఏసుని దేవుడని నమ్ముతాడు. ఇక అద్భుతాల విషయానికొస్తే, అది అవతారపురుషులకు మామూలే. మా దేశంలో తరతరానికీ ఎక్కడో ఒకచోట అవతార పురుషులు ఆవిర్భవిస్తూ ఉంటారు. ప్రస్తుతం మా దేశంలో సత్య సాయిబాబా అనే అవతారపురుషుడు ప్రజల్ని సమ్మోహ పరుస్తున్నాడు. ఆయన మనుషులకు సాధ్యం కాని అద్భుతాలు ఎన్నో చేసాడు, చేస్తున్నాడు. ఆయనకు ప్రపంచంలో అన్ని దేశాలలోనూ భక్తులు ఉన్నారు. ఆయన కూడా ఏసుక్రీస్తుని దేవుడని నమ్ముతాడు" అని ఆగాను.

నేను చెబుతున్నది కుతూహలంగా వింటున్నారిద్దరూ. నేను ఆగగానే చిన్నాయన ఉత్సాహంగా, "ఇంకేం, మీ దేశంలో పుట్టిన అవతారపురుషులు కూడా ఏసుని దేవుడని నవ్వుతున్నారు. మరి మీ సంగతి ఏమిటి?" అన్నాడు.

అప్పుడు నేను వాళ్లకి సత్య సాయిబాబా చేసిన అద్భుతాల వివరాలు కొన్ని చెప్పాను.

అందుకు నాకు నేను చదివిన 'మ్యాన్ ఆఫ్ మిరకిల్సు' పుస్తకం కూడా ఉపయోగపడింది.

అవి చెప్పేక, " బాబా అన్ని మతాల దేవుళ్లనీ నమ్ముతాడు, గౌరవిస్తాడు. తనవద్దకు వచ్చిన భక్తుడు క్రైస్తవుడు అయితే– అతడికి గాల్లోంచి బైబిల్ కానీ, సిలువ కానీ సృష్టించి ఇస్తాడు. ముస్లింలకి ఖురాన్ ఇస్తాడు. హిందువులకు భగవద్గీతో, శివలింగమో ఇస్తాడు. కానీ ఎవరినీ మతం మార్చుకోమని చెప్పడు. ఆయన గురించి హోవార్డ్ మఫెట్ అనే ఆస్ట్రేలియన్, 'మ్యాన్ ఆఫ్ మిరకిల్స్' అనే పుస్తకాన్ని రాశాడు. మీరు చదువుతానంటే...." అని నేను ఇంకా ఏదో చెప్పబోతున్నాను.

అంతలో శ్రీమతి ఉత్సాహంగా మంచం పక్క బల్లమీదున్న ఆ పుస్తకాన్ని తెచ్చి నాకు అందించింది.

ఆమె చొరవ చూస్తే వాళ్లకు – తమ రాక పట్ల ఆమెకెలాంటి స్పందన కలిగిందో అర్థమైపోతుంది.

నేనా పుస్తకాన్ని వాళ్లకు అందించబోయాను. అంతే!

ఇద్దరూ కూడా ఏదో తాకకూడని భయంకర పదార్థాన్ని చూసినట్లు కొంచెం వెనక్కి వాలారు. పుస్తకాన్ని అందించడానికి నేను కూడా కొంచెం ముందుకి వంగ వలసిన వాణ్ణే కానీ వాటం చూస్తే వాళ్లు కెవ్వుమని అరుస్తారనిపించింది.

"వద్దు వద్దు" అన్నారు ఇద్దరూ ఏకకంఠంతో. నేను కాదు, వాళ్లే మతం మార్చుకునే పరిస్థితొస్తుందన్న భయం ఆ గొంతుల్లో ధ్వనించింది.

పాత సినిమాల్లో మాంత్రికుడి ప్రాణం ఉన్న చిలుకను పట్టుకున్న హీరోలా నన్ను చూస్తున్నారు వాళ్లు.

నేను ఇంకా ఏదో అనబోగా, ఇద్దరూ లేచి నిలబడ్డారు. కూర్చోమన్నా కూర్చో పోయేసరికి నేనూ లేచి నిలబడ్డాను.

ఇద్దరూ నాతో కరచాలనం చేశారు.

అంటే ఇక సెలవు తీసుకుంటారని గ్రహించి, “మీరు నా మేలు కోరి స్నేహభావంతో వచ్చారు. చక్కగా మాట్లాడారు. మన సంభాషణ నేను కలకాలం గుర్తుంచుకుంటాను. ఒకవేళ నేను మిమ్మల్ని నిరుత్సాహపరిచే ఉంటే అన్యథా భావించక, నన్ను మన్నించండి” అన్నాను.

పెద్దాయన మొహంలో రిలీఫ్ కనిపించింది. ఆయన ఆప్యాయంగా, “మేము నిరుత్సాహపడ్డ మాట నిజం. కానీ అందుకు కారణం మీరు కాదు. మీరు మంచివారు. ఉత్తములు. మాకు నచ్చారు. మేము వచ్చిన పని కూడా మంచిదే. మీరన్నట్లు మీకు మేలు చేసేదే! అయితే మిమ్మల్ని ఒప్పించగల సామర్థ్యం మాలో లోపించింది. మరో రోజున, మాకంటే మెరుగైన ప్రవక్త వచ్చి, మెరుగైన పద్ధతిలో ఇదే సందేశాన్ని మీకందించి, మిమ్మల్ని ప్రభావితం చెయ్యగలదని ఆశిస్తున్నాను. సెలవు” అన్నాడు.

సుహృద్భావంతోనే వాళ్లకి వీడ్కోలు చెప్పగలిగినందుకు నాకెంతో సంతోషం కలిగింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments